# అక్కయ్య జీవితం

శ్రీ వేదుల రామమూర్తి

దీపావళి పండగ సమీపించింది. మా అన్నయ్య వదిననుకూడా తీసుకువచ్చాడు. మా గృహము పచ్చతోరణములతో కల కలలాడుతున్నది. కాని మా అక్కయ్య ముఖవర్చస్సు బాగాలేదు. ఆమె ముఖమున విషాద చిహ్నములు కనబడుతున్నాయి. దీపావళిరోజున మా అన్నయ్య స్నేహితులువచ్చారు. వరండాలో ఆడుచున్న మా అక్కయ్య కూతురు లీల వచ్చీరాని మాటలతో "అమ్మనాన్న" అని ఆయన దగ్గరకు చేరింది. మాలీలకు యిది పరిపాటి. ఎవరిని చూచినను యిలాగే అంటుంది. లోపలనుండి వచ్చిన అక్కయ్య కంట తడిపెట్టుకుని ""నాన్న కాదమ్మా"అని లోపలకు తీసుకుపోయింది. అక్కడే ఉన్న నేను అక్కయ్య మనోవేదన గ్రహించాను. పైన తల్లిదండ్రులుండగా గ్రహించి ఏమిచేయగలను? నేటి వివాహములు పుట్టింటివారికి అత్తింటివారికి మధ్య నలిగి నచ్చుటకేగాని సంసారసుఖమునకు కాదని తెలుసుకొన్నాను. అక్కయ్య జానకి పెండ్లి నాకు చాలా బాగా జ్ఞాపకముంది. నాన్నగారు చాల సంబంధములు వెదకించారు. వరుడునచ్చినను కట్నము భరింపలేమని భయపడి కొంతకాలము మౌనము వహించారు. అమ్మపోరువల్ల తిరిగి తిరిగి సంబంధమును ఖాయముచేసుకొని వచ్చారు. ఆసంబంధము అమ్మకు యిష్టంలేదు. అప్పటిలో మా జానకికి కూడా యిష్టములేకపోయినను నాన్నగారి ముఖము చూచి కాదనలేక పోయింది. మొత్తముమీద పెండ్లి నిశ్చయమైనది. మా ఆనందమునకు అంతులేదు. పెండ్లి సలక్షణముగానే జరిగింది. మా జానకి మాయింటివద్దనే ఆనందముగా కొంతకాలము కాపురముచేసింది. మా లీల ఆమెకుమూర్తియే. వివాహసమయములో కట్నముగా యివ్వవలసినపైకము యిప్పటివరకు నాన్నగారు చెల్లింపలేక పోయారు. మా జానకి ఏ ముఖముపెట్టుకొని అత్తింటికి పోతుంది చెప్పండి? పోనీ సాహసించి వెడుతుంది. భర్త ఊరుకుంటాడా? భర్త మంచివాడనుకుందాం. మా అమ్మకు ఆమెను పంపుటకిష్టములేదు. మా నాన్న మాఅమ్మచేతులలో కీలుబొమ్మ. ఇటువంటి విషమపరిస్థితులలో మాజానకి సంసారము చిగుర్చునా అని మధ్య మధ్య బాధపడుతూంటాను. మా బావ వచ్చి మాజానకిని పంపమన్నాడు. పెండ్లికిముందు బావనుగురించి మానాన్న అమ్మవద్దకోసినకోతలు బావలో కనపడక పోవుటచే బావముందు అనరాని మాటలని యిల్లరికం రమ్మన్నది. అప్పటినుంచి మా బావ మాజానకి ముఖం చూడటం మానుకున్నాడు. రానురాను మాలీల పెద్దది కూడా అగుచున్నది. ఏమిచేయను - దాని

కర్మం అలా ఉండని మా జానకి తరచు బాధపడతూంటుంది. నలుబది సంవత్సరములు దాటిన మా అమ్మకు యిప్పటికీ సంతానవాంఛ పోలేదు. కాని యిరువది సంవత్సరములు దాటని జానకిని బ్రహ్మచర్యము అవలంబించమని ఆమె కోరిక కాబోలు. అత్తింటికి పంపుటకు వప్పుకోదు. యింతకాలం మా బావ జానకితో పాటు బ్రహ్మచర్య దీక్ష సాగించాడంటే చాలా మంచి వాడనే వప్పుకోక తప్పదు. మొన్నటివరకు మా జానకిని పంపమని రాయబారములు సాగాయి. ఎన్ని జరిగినను మా అమ్మ పట్టుదలవదలలేదు. బావ రాసిన వుత్తరము యీ రోజునే చేరింది.

గుంటూరు
5_9_56

ప్రియమైనజానకికి కృష్ణ వ్రాయునదీ,

ఇంతకాలం నీక్షేమం కోరియున్నాను. కాని అట్లు ముందు ఉండనవసరములేదు. నీ భావి జీవితము నీ మీదనే ఆధారపడి ఉంది. పాపజీవితము కూడ బాగా ఆలోచించు. నీ వద్దనుంచి ఏ సమాధానము రానిచో త్వరలో నీవు మరియొక పెండ్లి శుభలేఖ అందుకోనవచ్చును.

కృష్ణ

బావరాసిన ఉత్తరం అక్క యొక్క హృదయ పద్మమును అగ్నిపర్వతమువలె పగిల్చింది. ఏమిచేయగలదు? ఎవరితో చెప్పుకోగలదు? కంటికి ఏకధారగా రాత్రింబవళ్లు ఏడ్చుచుండేది. బావఉత్తరము అమ్మకు నాన్నకు చూపించాను. నాన్న మౌనము వహించారు. మా అమ్మ యిదంతా నాటకమని పెదిమెలు విరిచింది. అంతేకాదు నా అనంతరంవరకు దానికి లోటులేదండి. తన అనంతరం దానిజీవితం అమ్మచూడదుగనుక.

నేటి నవీన ఆర్థికపరిస్థితులలో కుమార్తెల సంసార వినాశనమునకు దుష్టశక్తులు కల్పించువారు తల్లిదండ్రులేయని గ్రహింపగల్గుచున్నాము.

## ఏజంట్లు కావాలి!

రాజమహేంద్రవరం, విశాఖపట్టణము, విజయనగరము, కడప, తిరుపతి—యింకా యితర ప్రదేశాలలో మా పత్రికలు అమ్మబడనిచోట్లలో తమ స్వంత బాధ్యతపై అమ్ముటకు - ఏజంట్లుగా నున్నవారికి రూ. 100/-కు రూ. 20/-లు. కమీషను, ఒక ఫ్రీకాపీ యివ్వబడును.

అడ్వర్టైజుమెంటులను కాన్వాస్ చేయువారికి మంచి కమీషను సదుపాయముల నివ్వగలము.

వివరములకు:

గృహలక్ష్మి కార్యాలయం
రాయపేట, మద్రాసు-14